క్లుప్తంగా

ఘనంగా వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న సుంకర శ్రీనివాస్, సుంకర ఐశ్వర్య

కడప కార్పొరేషన్ : కడప నగరం చిన్నచౌకులోని శ్రీ అమోఘా హోండా షోరూం 19వ వార్షికోత్సవం నిర్వహించారు. బుధవారం షోరూం మేనేజింగ్ డైరెక్టర్లు సుంకర శ్రీనివాస్, సుంకర ఐశ్వర్యలు కేక్ కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్నేళ్లు వాహన రంగంలో విజయవంతంగా కొనసాగడం సామాన్యమైన విషయం కాదన్నారు. షోరూం అభివృద్ధికి పాటుపడిన ఉద్యోగులు, ఫైనాన్స్, ఆర్టీఏ, ఎక్చేంజ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేల్స్ ఇన్‌చార్జి రమేష్, సర్వీస్ ఇన్‌చార్జి వినయ్, జనరల్ మేనేజర్ మల్లికార్జున, ఫైనాన్స్ మేనేజర్లు పాల్గొన్నారు.

రైతులకు పంటసాగు సాయం అందించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : తెలంగాణ ప్రభుత్వ తరహాలో మన రాష్ట్రంలో కూడా ఎకరాకు రూ. 10 వేలు చొప్పున పంట సాగు సాయం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను ఇవ్వాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని ఆర్ఎస్‌వైఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిలా కార్యదర్శి నాగేంద్రబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పన్నులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి అర్థ సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి పన్నులపై రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ మిన హాయింపు ఇచ్చిందని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఆస్తి పన్ను యజమానులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుని, జూన్ 30వ తేదీలోపు తమ పన్నులను చెల్లించి వడ్డీ మినహాయింపు పొందాలని సూచించారు. 29న బక్రీదు సందర్భంగా సెలవు దినం అయినప్పటికీ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అవకాశం

కడప కార్పొరేషన్ : బక్రీదు సందర్భంగా గురువారం సెలవుదినం అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాల్లో బిల్లులు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా మెరుగైన పనితీరును కనబరచాలని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కడప ఆర్టీసీ గ్యారేజీలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప రీజియన్ వ్యాప్తంగా కండక్టర్లు, డ్రైవర్లు, ఏడీసీలు, మెకానిక్‌లకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్నామన్నారు. కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్ష కేంద్రాల తనిఖీ

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్ష కేంద్రాలను విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఓబులవారిపల్లె, ఒంటిమిట్ట, రాజంపేట, కోడూరు కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలను పూర్వ కులసచివులు ఆచార్య విజయ రాఘవప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వవిద్యాలయ పరిధిలోని 57 కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయని, ఇందులో 42,300 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు.

సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలి

కడప ఎడ్యుకేషన్: వలంటీర్లు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని యోగివేమన విశ్వ విద్యాలయం పీజీ కళాశాల ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి అన్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్–4 ప్రోగ్రాం అధికారి సునీతా ఆధ్వర్యంలో వలంటీర్లు శ్రమదానం చేశారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా క్యాంపస్‌లోని సీవీ రామన్ బ్లాక్‌లోని కార్‌షెడ్ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ సెల్ కో ఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి వలంటీర్లు పాల్గొన్నారు.

పండుగలకు స్వాగతం



కడప కల్చరల్ : తొలి ఏకాదశి హిందువులకు ఆనందం పంచే పండుగ. దీని తర్వాత ఉగాది వరకు ప్రతి నెల కనీసం ఒక పెద్ద పండుగ వస్తుంది. అందుకే దీన్ని తొలి పండుగగా పేర్కొంటారు. గురువారం తొలి ఏకాదశి. ఈ మాసం తర్వాత శ్రావణమాసం వస్తుంది. ఈ మాసంలో పండుగలు, శుభ కార్యాలు, వివాహాలు, ప్రారంభోత్సవాలు ఎక్కువగా నిర్వహిస్తారు. అందుకే తొలి ఏకాదశి శుభదాయకమైనదని హిందువులు విశ్వసిస్తారు.

మహావిష్ణువు యోగ నిద్ర

ఈ మాసంలో మహా విష్ణువు యోగ నిద్ర ప్రారంభిస్తారని పురాణాల ద్వారా తెలుస్తోందని పెద్దలు చెబుతారు. ఇటు నిద్ర, అటు మెలకువ కాని స్థితినే యోగ నిద్ర అంటారని వైదిక కాలం నాటి మహారుషులు, యోగులు తరుచూ ఈ యోగ దీక్ష చేపట్టే వారని కూడా చెబుతారు. ఈ దీక్షలో అలౌకిక ఆనందం, మానసిక సౌఖ్యాన్ని పొందవచ్చని తెలుస్తోంది. ప్రస్తుత రోజుల్లో యోగా గురువులు కూడా పలు శారీరక, మానసిక రుగ్మతల నుంచి దూరమయ్యేందుకు శిష్యులతో ఈ యోగ నిద్రను సాధన చేయిస్తున్నారు. ఆషాఢశుద్ధ ఏకాదశినే తొలి ఏకాదశి అంటారు. ఈ సందర్భంగా యోగ నిద్రలోకి వెళ్లే కృష్ణమూర్తి తిరిగి కార్తీక శుద్ధ (ఉత్థాన) ఏకాదశి నాడు నిద్ర లేస్తారన్నది పురాణ కథనం.

ప్రత్యేక పూజలు

ఈ సందర్భంగా వైష్ణవాలయాలన్నీ భక్తులతో కళకళలాడతాయి. అన్ని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. విష్ణు సహస్ర నామ పారాయణం చేసి ఉపవాస దీక్షతో రాత్రంతా జాగరణ చేసి ఉదయం స్నానానంతరం తిరిగి విష్ణుమూర్తికి విశేష పూజలు చేయాలన్నది తొలి ఏకాదశి పూజా విధానాలలో ఒకటి. ఇప్పటి నుంచి గో పూజలు నిర్వహించడం మంగళదాయకమని భావిస్తారు.

వైష్ణవులు ఎంతో పవిత్రమైనదిగా భావించే తొలి ఏకాదశి నుంచి నాలుగు మాసాలపాటు పీఠాధిపతులు దీక్షలు వహిస్తారు. వాటినే చాతుర్మాస దీక్షలుగా పేర్కొంటారు. ఎండల నుంచి చలికి మారే వాతావరణాన్ని, ఆపై కొన్ని నెలలపాటు వచ్చే చలిని భరించేందుకు శిక్షణగా గురువులు ఈ దీక్షలు వహిస్తారని పెద్దలు చెబుతారు. తెలుగునాట గల పలువురు పీఠాధిపతులు, ఆశ్రమాధిపతులు కూడా నాలుగు నెలలపాటు చాతుర్మాస దీక్ష చేపడతారు. జిల్లాలోని దేవునికడప, ఒంటిమిట్ట, నందలూరు, జమ్మలమడుగు నారాపురస్వామి దేవాలయం, ప్రొద్దుటూరు శ్రీ చెన్నకేశవస్వామి ఆలయాలతో పాటు జిల్లాలోని చిన్న, పెద్ద వైష్ణావాలయాలన్నింటిలో తొలి ఏకాదశి కార్యక్రమాలను గురువారం నుంచి ప్రారంభిస్తారు.

అధికమాసం

సాధారణంగా ఏకాదశి తర్వాత నెల రోజులకు శ్రావణమాసం వస్తుంది. కానీ ఈ ఏడాది జులై 18 నుంచి అధిక శ్రావణం రానుంది. తర్వాత నెలరోజులకు నిజ శ్రావణం వస్తుంది. అధిక శ్రావణంలో ఎలాంటి శుభకార్యాలు తలపెట్టరు. నెలరోజుల తర్వాత రానున్న నిజ శ్రావణంలో మాత్రమే శుభకార్యాలు నిర్వహిస్తారు.

సత్యదేవుని ఆలయంలో తొలి ఏకాదశి

ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశిని పురస్కరించుకుని గురువారం కడప నగరంలోని శ్రీ లక్ష్మి సత్యనారాయణ స్వామి ఆలయంలో విశేష పూజోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కల్యాణపురం విజయ్‌భట్టర్ తెలిపారు. ఉదయం 6.30 నుంచి మహాసంకల్పం, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, విశేష అలంకారం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. 9.30 గంటలకు గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

మసీదుల్లో బక్రీద్ ప్రార్థన వేళలు

కడప కల్చరల్ : బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం నిర్వహించే సామూహిక ప్రార్థనల కోసం కడప నగరంలో మసీదులు, ఈద్గాలలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, మసీదు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నగర శివార్లలోని బిల్టప్, దండు ఈద్గాలు తదితర ఈద్గాలు, దాదాపు అన్ని మసీదులలో ప్రార్థనల కోసం తగిన ఏర్పాట్లు చేశారు.

మసీదు	ప్రాంతం	ప్రార్థనా సమయం (ఉదయం)
అన్వరుల్లా	ఏ-1 నగర్	7.30
గఫ్పారియా	ఏ-1 నగర్	7.00
టైమర్‌జీ	సాయిపేట	7.00
మరియం	అల్మానగర్	7.00
బొగ్దాదియా	సాయిపేట	6.30
హుసేనియా	అగాడి	9.30
ఇనాయత్‌ఖాన్	అగాడి	8.30
అల్మాస్‌పేట	అల్మాస్‌పేట	9.00
నాగూర్‌బాషా	వినాయకనగర్	7.00
మదార్‌సాహెబ్	వినాయకనగర్	8.30
అమ్మదియా	లోహియానగర్	6.30
రభీజియా	మోచంపేట	9.00
రాజాఖాన్‌బాగ్	బుర్హనుద్దీన్ వీధి	9.00
హాజిరా	దస్తగీర్‌జెండా వీధి	9.00
ఆజమ్	ఖిల్లా మసీదు	7.30
బుర్హనుద్దీన్	చిలకలబావి	7.00
మద్దేఖాన్‌మసీదు	చిలకలబావి	9.00
సలీమున్నీసా	సానియా మదరసా	8.00
సాబీర	బిస్మిల్లా నగర్	9.00
బహదూర్‌ఖాన్	జేకేఎం వీధి	10.30
అంజదియా	చాంద్‌ఫిరాగుంబద్	8.00
ఇబ్రహీం ఖలీలుల్లా	మర్కస్	7.00
యతీంఖాన	మద్రాసురోడ్డు	8.00
యాకుబ్‌సాహెబ్	మద్రాసురోడ్డు	10.30
ఏడురోడ్లు	ఏడురోడ్లు	7.00
గుంతబజారు	ఎన్టీఆర్ సర్కిల్	10.00
షహమీరియా	రవీంద్రనగర్	7.00
బుఖారియా	మురాదియానగర్	6.30
నూర్ మసీదు	మరాఠివీధి	8.00
ఏక్ మినార్	మరాఠివీధి	7.00
హుజురా	రవీంద్రనగర్	9.00
మక్కా	రవీంద్రనగర్	9.00
ఫతేఖాన్	కాగితాల పెంట	8.30
మహమ్మదియా	ప్రకాశ్‌నగర్	8.30
రోషన్ మున్వర్	జిల్లా కోర్టు ఎదురుగా	10.00
మహమ్మదియా	రాజారెడ్డివీధి	9.30
మహబూబియా	రైల్వేస్టేషన్‌రోడ్డు	7.30
ఉమర్ ఫరూఖ్	నిరంజన్ కాలనీ	7.00
నూరాని	బుచ్చర్‌వీధి	9.00
అనాస్	కో ఆపరేటివ్ కాలనీ	7.15
అనస్	మున్సిపల్ మైదానం	8.30
హసీమ్	బ్యాంకు కాలనీ	9.00
అఫ్సా	ఖలీల్‌నగర్	6.30
ఖిజర్	ఖలీల్‌నగర్	7.00
నకాష్	నకాస్	7.00
అమీనియా	పెద్దదర్గా (బళ్లారిరోడ్డు)	10.00
జుమ్మా మసీదు	వైవీ స్ట్రీట్	10.00
హౌస్ మసీదు	హౌస్ వీధి	8.00
మహబూబ్ ఇలాహి	మార్కెట్	6.45
సిద్దిఖ్	గరీబ్‌షా వీధి	6.45
ఫరూఖ్	గౌస్‌నగర్	6.30
గౌస్ ఆజం	గౌస్ నగర్	7.00
అమీన	అఫ్జల్‌ఖాన్ కాలనీ	8.30
పాతకడప	పాతకడప	7.00
అల్ బదర్	శంకరాపురం	7.15
మసీదు అక్బర్	వైఎస్సార్ కాలనీ	8.00
మక్కా మసీదు	జీడి కాలనీ	7.30
ఉస్మాన్	సైనిక్‌నగర్	8.30
ఆటోనగర్	ఆటోనగర్	9.00
మదీన మసీదు	ఆర్మీ నగర్	7.00
రహమానియా	అశోక్‌నగర్	8.00
అబుబకర్ సిద్దిఖ్	నెహ్రూనగర్	6.30
బిలాల్	ఎన్జీఓ కాలనీ	9.00
అబూ హురేరా	కో ఆపరేటివ్ కాలనీ	8.30
మజ్జిద్ నబవి	మృత్యుంజయకుంట	8.00
బిలాల్	హోమియోపతి కళాశాల వద్ద	8.00
బ్యాంకు మసీదు	జెడ్పీ వద్ద	8.00
అక్సా మసీదు	నాగరాజుపేట	8.00
సాలేహాత్‌మదరసా	వక్కలపేట	7.00
అయేషా మసీదు	అయేషానగర్	7.00
మురాదియా ఈద్గా	దండు	10.45
అమీనియా ఈద్గా	బిల్టప్	10.30
అహలె హదీస్ ఈద్గా	తురకపల్లె	7.00
మనరుల్ హుదా	జమాల్‌పల్లె	7.15
అస్తానె హుసేనియా	ఎల్ఎఫ్ స్ట్రీట్	7.00
రిమ్స్ ఈద్గా	రిమ్స్ వద్ద	7.15
అస్రఫియా	అఫ్సర్‌ఖాన్ కాలనీ	9.30
ఫైజ్ అక్బర్ ఈద్గా	జమాల్‌పల్లె	6.30
తయ్యబ్ కాలేజీ	రామరాజుపల్లె	6.30
మహమ్మదియా సిద్దిఖి	అక్కాయపల్లె	7.30
ఖుబా మదరసా	సాగర్ కాలనీ	7.15
రెహమానియా మదరసా	మదీన కాలేజీ వద్ద	6.30
అబ్దుల్ సత్తార్	బెల్లంమండివీధి	8.00
షాహి మసీదు	చెన్నూరు	7.30
ఖిల్లా మసీదు	చెన్నూరు	7.00

తెలుగు వాడుకపై శ్రద్ధ చూపుదాం!



డీఈఓ రాఘవరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న డాక్టర్ తవ్వా వెంకటయ్య

కడప కల్చరల్ : ప్రభుత్వ కార్యకలాపాల్లో తెలుగు వాడకం పట్ల శ్రద్ధ చూపుదామని ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య అన్నారు. బుధవారం కడప నగరంలోని విద్యాశాఖాధికారి రాఘవరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను తప్పకుండా తెలుగులో రాసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల నామఫలకాలు చాలా వరకు ఆంగ్లంలోనే ఉన్నాయని, వాటిని కూడా తెలుగులో ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యాశాఖాధికారి స్పందిస్తూ పాఠశాలల్లో తెలుగును అధికారికంగా అమలు చేసేందుకు వెంటనే ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అధికారభాషా సంఘం సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి తెలుగు అమలు శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తామన్నారు.

మాలలను శత్రువుల కన్నా హీనంగా చూసిన టీడీపీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్

కడప కార్పొరేషన్ : మాలలను శత్రువులుగా చూసిన పార్టీ ఏదైనా ఉందంటే అది టీడీపీయేనని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆధ్వర్యంలో మాలల ఆత్మీయ సభ నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. మాలల గురించి మాట్లాడే నైతిక అర్హత టీడీపీకి లేదన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు కూడా మాలల సంక్షేమం గూర్చి ఆలోచన చేయలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల, మాదిగల మధ్య చిచ్చురేపారన్నారు. ఇప్పుడు ఎన్నికలొస్తున్నాయనే మాలలపై ప్రేమ ఒలకబోస్తున్నారన్నారు. దివంగత వైఎస్సార్ అధికారంలోకి వచ్చాక మాల, మాదిగలకు రాజకీయంగా, ఆర్థికంగా, అభివృద్ధి పరంగా, సంక్షేమ పరంగా సమ ప్రాధాన్యమిచ్చారన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో ఇవ్వని విధంగా మాలలకు మూడు మంత్రిపదవులు, ఒక డిప్యూటీ సీఎం, మండలి చైర్మన్, ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవులు ఇచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2024లో వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు మాలలు కృతనిశ్చయంతో ఉన్నారన్నారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా, దళిత నాయకులు లక్ష్మినారాయణ, నరసింహ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు మహిళా పోలీసులు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు లక్ష్మిదేవిలు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా స్థాయి మాస్టర్స్ ట్రైనర్ ట్రైనింగ్ ప్రోగామ్, కౌమార బాలికల సాధికారత, బాల్య వివాహాల నివారణ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 నుంచి 16 సంవత్సరాల వయస్సులో ఉన్న బాలికల సమాచారాన్ని మహిళా పోలీసులు సేకరించి ఉంచుకోవాలన్నారు. అలాగే స్కూలు డ్రాపౌట్స్ కాకుండా చూడాలని తెలిపారు. బాల్య వివాహాలు జరుగుతున్న విషయం తెలిసిన వెంటనే బాలికకు, బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చే విధంగా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో దిశ పోలీసుస్టేషన్ సీఐ వినయ్‌కుమార్‌రెడ్డి, మహిళా ఎస్ఐ, సీడీపీఓ సునంద, మహిళా పోలీసులు సుజిత, విజయ, రేష్మా, చంద్రకళ, మీనాక్షి, సునీత, కిరణ్మయి, వసంతలక్ష్మి, అంజలి, డీసీపీఓ సుభాష్‌యాదవ్, డీఆర్‌డీఏ, మెప్మా, విద్యాశాఖ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే దళితుల సంక్షేమం సాధ్యం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే దళితుల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు పి. సంపత్ కుమార్, కార్పొరేటర్ ఆర్. చెన్నయ్య, చైతన్య అన్నారు. బుధవారం తమ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో ఆది నుంచి ఎస్సీ, ఎస్టీ కులాలను అపహాస్యం చేస్తూ దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా.. ఎస్సీలకు చదువు రాదు అంటూ చంద్రబాబు అండ్ కో మాట్లాడిన మాటలను ఎవరూ మర్చిపోరన్నారు. ఓట్ల కోసమే ఇప్పుడు మాలల ఆత్మీయ, మాదిగల ఆత్మీయ సభ అంటూ నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. 1997లో పీవీ రావు ఛలో అసెంబ్లీకి పిలుపునిస్తే మాలలను గుర్రాలతో తొక్కించి ఐదుగురి ప్రాణాలు పోవడానికి కారణం చంద్రబాబేనన్నారు. బాబు హయాంలో దళితులపై దాడుల్లో ఏపీ నంబర్‌వన్‌గా ఉండేదన్నారు. దళితులను ఆదరించే నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. మాల మాదిగలను రెండు కళ్లలాగా చూస్తూ వారి అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం జగన్‌కు దళితులు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి

కడప ఎడ్యుకేషన్ : బాస్కెట్‌బాల్ గుంటూరు, ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాట్ ఆసోసియేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23,24,25 తేదీల్లో గుంటూరులో జరిగిన ఇంటర్ జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ బాలుర విభాగంలో కడప కేఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభను చాటారు. ఇందులో సూర్యప్రకాష్ సాయిచరణ్, నాగేంద్రకుమార్, రాఘవేంద్ర, వంశీకృష్ణలు వైఎస్సార్‌జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు.ఉత్తమ ప్రదర్శన కనబరిచి ప్రశంసపత్రాలను అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, పిజికల్ డైరెక్టర్లు వంశీనాయక్, నారాయణ, కేఎల్ఎం ఫిజికల్ డైరెక్టర్ గంగాదేవిలు విద్యార్థులను అభినందించారు.

బధిరులకు వాహనదారులు సహకరించాలి



వాహనానికి స్టిక్కర్లను అతికిస్తున్న రవాణాశాఖ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బధిరులైన మూగ, చెవిటి వాహనదారులకు ప్రతి ఒక్క వాహనదారుడు సహకరించాలని జిల్లా ఉప రవాణాశాఖ ఇన్‌చార్జి కమిషనర్ నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో బధిరులైన మూగ, చెవిటి వాహనదారులైన 15 మందికి డ్రైవింగ్ లైసెన్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం వాహనాలకు రవాణశాఖ అధికారులు తగిన గుర్తింపుతో కూడిన స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో ఎంవీఐలు శివప్రసాద్, విజయభాస్కర్, ఏఎంవీఐ లక్ష్మిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ సంస్థలను అమ్మకానికి పెట్టడం, అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల హక్కులను హరించే విధంగా చట్టాలు చేయడం తగదని ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసు బ్బారెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని హెూచిమిన్ భవన్‌లో ఏఐటీయూసీ కడప జిల్లా సమితి ఆఫీస్ బేరర్స్ సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో స్కీంలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు సంవత్సరాల తరబడి అమలుకు నోచుకోకపోవడం నిర్లక్ష్యాన్ని ఎండగొడుతూ ఆందోళనకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జునరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఉద్దె మద్దిలేటి, మస్తాన్, లింగన్న జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్ బాషా పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలకు డిమాండ్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. కడప విభాగ్ కన్వీనర్ కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ మౌలిక వసతులు లేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల వద్ద నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ డీఈఓ, ఇతర అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో చెప్పాలన్నారు. ఫీజుల పట్టికను కళాశాలల్లో ప్రదర్శించాలన్నారు. అనుమతులు లేని పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఏబీవీపీ నాయకులు ఆదిత్య, రాజు, వంశీ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భవ

కడప నగరంలో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య సంరక్షణకు అభయమిస్తున్నాయి. ఈ ఆరోగ్య కేంద్రాలు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలను అందిస్తున్నాయి. దీంతో ప్రాథమిక దశలోనే నగర వాసుల జీవన ప్రమాణాలు మెరుగుపడే దిశగా అడుగులు పడుతున్నాయి.

- కడప వాసులకు చెంతనే ఉచిత వైద్యం
- ప్రజల ఆరోగ్య సంరక్షణకు భరోసా ఇస్తున్న 'డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం'

మొత్తం ఆసుపత్రుల సంఖ్య	13
కొత్త భవనాలు మంజూరు	09
అద్దె భవనాల్లో కొనసాగుతున్నవి	04

నాడు.. కడప నగరంలో మొన్నటి వరకు ఆరంటే ఆరే పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండేవి. పైగా నిత్యం మందుల కొరత వేధించేవి. వైద్య పరీక్షలా అంతంతమాత్రంగా జరిగేవి. ఇక ఆసుపత్రుల్లో సౌకర్యాల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. ఇలా టీడీపీ హయాంలో పట్టణ వైద్యం అనారోగ్యంతో గాడి తప్పింది.

నేడు.. కడప నగరంలో ప్రస్తుతం 13 పట్టణ ఆరోగ్య కేంద్రాలు వెలిశాయి. మందుల కొరత మాటే లేదు. ఒకటా రెండా 64 రకాల వైద్య సేవలు లభిస్తున్నాయి. ఇక సౌకర్యాలంటారా నూతన భవనాలు.. కొత్త పరికరాలతో కార్పొరేట్ హాస్పిటల్స్‌ను తలపిస్తున్నాయి. వెరసి నగరవాసులకు మెరుగైన వైద్యం చెంతనే లభిస్తోంది.

కడప రూరల్: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి వైద్య రంగం కొత్త పుంతలు తొక్కింది. గతంలో కడప నగరంలో 6 మాత్రమే ఉన్న ఆరోగ్య కేంద్రాల సంఖ్య ఇప్పుడు 13కు చేరింది. అందులో చాలా వరకు కొత్త భవనాల్లో ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. అందుకోసం ఒక ఆసుపత్రికి రూ. 97.82 లక్షలు ఖర్చు చేశారు. కొన్ని పాత ప్రభుత్వ భవనాలకు ఒక దానికి రూ.15 లక్షలకు పైగా మరమ్మతులకు ఖర్చు చేశారు. కొత్త భవనాలు నిర్మాణం కాని ప్రాంతాల్లో, ప్రభుత్వ భవనాలు లేని చోట వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా అద్దె భవనాల్లో వైద్య సేవలు కొనసాగుతన్నాయి.

ఆదరణ అమోఘం...

ఈ ఆసుపత్రుల్లో ప్రాథమికంగా షుగర్, బీపీ, జ్వరాలు, వాంతులు, విరేచనాలు తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. ఇక్కడ 64 రకాల వైద్య సేవలతో పాటు 172 రకాల మందులు లభిస్తాయి. ఒక ఆసుపత్రికి రోజుకు 41 నుంచి 100 మందికి పైగా ఔట్ పేషెంట్స్ వస్తున్నారంటే ఈ ఆసుపత్రులకు ఉన్న ఆదరణ అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకు కడప నగరంలోని నకాష్, మోచంపేట ఆసుపత్రులకు ఒక రోజుకు 80 మందికి పైగా ఓపీలు వస్తున్నాయి. ఈ ఆసుపత్రులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయి. ఈ ఆసుపత్రుల్లో లభిస్తున్న వైద్య సేవలపై కడప వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కడప మారుతీనగర్‌లో గల డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కడప నగరంలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వివరాలు

సంఖ్య	కేంద్రం పేరు
1	అబ్దుల్‌నబీ స్ట్రీట్
2	ఆలంఖాన్‌పల్లె
3	అక్కాయపల్లె
4	నాగరాజుపేట
5	పాత కడప
6	భగత్‌సింగ్ నగర్
7	ఫక్కీరుపల్లె
8	ఎన్జీఓ కాలనీ
9	అగాడీ స్ట్రీట్
10	రాధాక్రిష్ణనగర్
11	రవీంద్రనగర్
12	ఎర్రముక్కపల్లె
13	వికలాంగుల కాలనీ

పోస్టర్ల ఆవిష్కరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగాంలో గర్భిణులకు హెచ్‌బీ టెస్టులు చేయించాలని, అలాగే పుట్టిన ప్రతి బిడ్డకు వారికి అందించే వ్యాధి నిరోధక టీకాలు అప్‌లోడ్ చేయాలని ఓఎస్‌డీ రఘునాథ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సభా భవనంలో హెల్త్ ఇండికేటర్స్‌పై ప్రోగామ్ ఆఫీసర్స్‌కు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిచారు. అనంతరం లెప్రసీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ప్రతిరోజు హై రిస్క్ గర్భిణులకు కాల్ చేసి వారికి అవసరమైన సూచనలు వైద్యాధికారి ఇవ్వాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ఎన్‌సీడీ స్క్రీన్ 100 శాతం చేయాలని, 10–19 సంవత్సరాల ఆడపిల్లలకు హెచ్‌బీ టెస్టు చేయించాలని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డివిజనల్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రోగామ్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్, బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

కడప కార్పొరేషన్ : మామిళ్ల పల్లె పంచాయితీ పరిధిలో కబ్జాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు కె. మత్తయ్య మాదిగ, పి. బాలసుబ్బయ్య మాదిగ కోరారు. గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇందిరానగర్‌కు వచ్చిన ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డికి వారు వినతి పత్రం సమర్పించారు. సర్వే నంబర్ 730, 731, 732 లలో కొందరు పాట్లు వేసి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.